ఉత్సాహంగా డెకథ్లాన్ స్కేటింగ్ రేస్

సనత్‌నగర్: అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్‌లో డెకథ్లాన్ స్కేటింగ్ రేస్ ఉత్సాహంగా జరిగింది. చిన్నారులను ప్రోత్సహించడంతో పాటు క్రీడా నైపుణ్యాన్ని మరింతగా పెంపొందించే లక్ష్యంగా డెకథ్లాన్ సంస్థ స్కేటింగ్ రేస్‌ను నిర్వహించింది. కోచ్ పవన్‌కుమార్ పర్యవేక్షణలో చిన్నారులు స్కేటింగ్ రింక్‌లో పోటీపడి అద్భుత ప్రతిభ కనబరిచారు. అనంతరం చిన్నారులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

రాంగోపాల్‌పేట్: రోడ్డు ఆక్రమణలను మహంకాళి ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. గురువారం రాత్రి మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉప శంకర్, ఎస్సై మహేష్ సిబ్బందితో కలిసి ఎస్డీరోడ్డలోని మినర్వా కాంప్లెక్స్ ఎదురుగా దుకాణాల ముందు ఏర్పాటు చేసికున్న షెడ్లను తొలగించారు. మరో సారి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

వర్గీకరణ పూర్తయ్యే వరకు నియామకాలు వద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ఉద్యోగాల నియామకాలను ఆపాలని మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎంఎస్ఎఫ్) ఓయూ అధ్యక్షులు ఎల్. నాగరాజు గురువారం డిమాండ్ చేశారు. తీర్పు వచ్చి 2 నెలలు గడుస్తున్నా ఇంత వరకు వర్గీకరణ పై ఎలాంటి పురోగతి కనిపించడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రతి ఉద్యోగాన్ని ఎస్సీ వర్గీకరణ నిబంధనతో భర్తీ చేయాలని నాగరాజు డిమాండ్ చేశారు.

సందడిగా బతుకమ్మ వేడుక




పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్‌లోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగు రంగుల పువ్వులతో బతుకమ్మను పేర్చారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, జ్యోతి, సంపూర్ణ, విజయ్, ఐలయ్య, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రభుత్వం గాలికొదిలేసింది

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం గాలి కొదిలేసిందని ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ విమర్శించారు. బోర్డు పరిధిలోని రెండవ వార్డు అన్నానగర్, అర్జున్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 119 నియోజకవర్గాలు ఉండగా 118 మాత్రమే ఉన్నాయని భావించి కంటోన్మెంట్ ప్రాంతాన్ని విస్మరిస్తోందని అన్నారు. నిజానికి కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం బీజేపీ ద్వారానే అభివృద్ధి జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి స్వామి, యువమోర్చా నాయకులు హర్ష, రమేష్ మహిళా మోర్చా నాయకులు మమత, వర్ష తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శుల నియామకం



సికింద్రాబాద్: మహంకాళి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా కనకట్ల హరి అరవింద్, కార్యదర్శిగా మద్దెర్ల శ్యాం సుందర్ నియమితులయ్యారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన వీరిని ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా నియమిస్తున్నట్టు మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బి.శ్యాంసుందర్‌గౌడ్ గురువారం ప్రకటించి నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైల్వేకార్మికుల బోనస్‌ను వెంటనే ప్రకటించాలి



మజ్దూర్ యూనియన్ యువ సమ్మేళనంలో పాల్గొన్న శంకర్‌రావు

సికింద్రాబాద్: కార్మికుల బోనస్‌ను రైల్వే యాజమాన్యం తక్షణమే ప్రకటించాలని దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం సికింద్రాబాద్‌లోని యూనియన్ కార్యాలయంలో మజ్దూర్ యూనియన్ కార్మికుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శంకర్‌రావు మాట్లాడుతూ రైల్వే కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు చేస్తున్నామన్నారు. తమ యూనియన్ చేపట్టిన ఆందోళనల ఫలితంగానే రైల్వేకార్మికుల హక్కులు పరిరక్షించగలిగామన్నారు. కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ కార్యదర్శి రవీందర్, క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి, యూనియన్ అన్ని విభాగాల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

దర్గాలో చాదర్ సమర్పించిన డిప్యూటీ మేయర్



లాలాపేట: హైదరాబాద్ నాంపల్లిలోని ప్రాచీన హజ్రత్ యూసూఫెయిన్ ఔర్ శరిఫెయిన్ దర్గాను గురువారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అక్కడ చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అభిషేకాలు.. అర్చనలు

ఘనంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు..

దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలతో శోభయామానంగా వెలుగొందుతున్నాయి. అమ్మవారి ఆలయాలు శరన్నవరాత్రుల శోభను సంతరించుకున్నాయి. రోజుకొక అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తూ భక్తులను కనువిందు చేయనున్న అమ్మవారు మొదటి రోజు శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, విశేష పూజల్లో భక్తజనం నిమగ్నమయ్యారు. -సనత్‌నగర్



అలంకారంలో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో..

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో గురువారం దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్‌లు అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, అత్తెల్లి అరుణగౌడ్, కిరణ్మయి, మాజీ ధర్మకర్తలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో గుత్త మనోహర్‌రెడ్డి, అనువంశిక ధర్మకర్త సురిటి కామేష్‌లు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టారు.

రాజరాజేశ్వరీ ఆలయంలో..

మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీ అమ్మవారు గురువారం బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చారు. ఉదయం అమ్మవారికి 108 లీటర్లతో క్షీరాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో క్షీరాభిషేక దాతలు, దీపక్ ప్రజ్ఞ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, ప్రభావతి, సత్సంగ్ సభ్యులు విజయలక్ష్మి, రాజేశ్వరి, అరుణలు పాల్గొన్నారు.

ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలి



బల్కంపేట అమ్మవారిని దర్శించుకున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించేలా అమ్మవారు ఆశీస్సులు ప్రసాదించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. దేవీ నవరాత్రులు సందర్భంగా గురువారం బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇన్‌చార్జి ఈఓ కృష్ణ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి,ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఛైర్మన్ సాయిబాబాగౌడ్ పాల్గొన్నారు.

దండుమారెమ్మ ఆలయంలో కలశస్థాపన



పూజలందుకుంటున్న బాలత్రిపుర సుందరి

రసూల్‌పురా: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కంటోన్మెంట్‌లో ప్రసిద్ధి చెందిన బాలంరాయి శ్రీ దేవి దండుమారెమ్మ ఆలయంలో గురువారం మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవి విశేషలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం 8 గంటలకు కలశస్థాపన, సాయంత్రం కుంకుమార్చన, మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



హనుమాన్ ఆలయంలో రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు



సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో...



బేగంపేట కట్టమైసమ్మ ఆలయంలో...



బంగారు మైసమ్మ ఆలయంలో ..



నవరాత్రివేడుకలకు హాజరైన కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: పార్శిగుట్ట మధురానగర్ కాలనీలోని బంగారు మైసమ్మ దేవాలయంలో గురువారం దేవి నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారిని బాలా త్రిపురాసుందరీదేవి అలంకరణలో భక్తుల దర్శనం కోసం ఉంచారు. ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ప్రారంభమైన వేడుకలకు సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో మధురానగర్ కాలనీ అధ్యక్షుడు బాలిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ధనేఖర్, ప్రకాష్, మన్మోహన్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

పాత నేరస్తుడి అరెస్టు

రాంగోపాల్‌పేట్: తాళాలు ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి తాళం పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని సెక్రటేరియేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన మేరకు.. మక్తాకు చెందిన ఆటో డ్రైవర్ బాలకృష్ణ మంగళవారం నల్గొండకు వెళ్లాడు. ఇంటికి తాళం వేసి చెప్పుల స్టాండులోని షూస్‌లో తాళం చెవి పెట్టి వెళ్లాడు. ఈస్ట్‌గోదావరి జిల్లా మల్లెపల్లి గ్రామానిక చెందిన మణికంఠ (21) తాళాలు వేసిన ఇండ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. బాలకృష్ణ ఇంటికి వెళ్లిన నిందితుడు షూలో ఉన్న కీస్ తీసుకుని తాళం తెరిచి ఇంట్లోకి వెళ్లాడు. బీరువా పగులగొట్టి అందులో ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలించి యథావిధిగా ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడు. బుధవారం ఇంటికి వచ్చిన బాలకృష్ణ లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే నిందితున్ని పట్టుకుని ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

కేవైసీ అప్‌డేట్ పేరిట రూ.28వేలు స్వాహా

రాంగోపాల్‌పేట్: యూనియన్ బ్యాంకు కేవైసీ పేరుతో ఓ అప్లికేషన్ పంపి దాన్ని ఓపెన్ చేసిన వారి ఖాతాలను ఖాళీ చేశారు సైబర్ నేరగాళ్లు. అంతే కాకుండా అప్లికేషన్ ఓపెన్ చేసిన వారి మొబైల్ ఫోన్ హ్యాక్ చేసి అతని వాట్సాప్ గ్రూపుల్లోకి దాన్ని ఫార్వర్డ్ చేశారు. ఇలా నగరంలో గురువారం చాలా మంది తమ ఖాతాల్లో డబ్బును పోగొట్టుకున్నారు. బేగంపేటకు చెందిన రాజు అనే వ్యక్తికి ఓ వాట్సాప్ గ్రూపులో మీ యూనియన్ బ్యాంకు ఖాతా బ్లాక్ అయింది, ఆధార్ కేవైసీ అప్డేట్ చేసికోండి అనే మెసెజ్ వచ్చింది. ఇంట్లో ఉండే పిల్లల చేతిలో ఫోన్ ఉండటంతో వారు తెలియక ఓపెన్ చేశారు. దీంతో కొద్దిసేపట్లోనే అకౌంట్ లోని రూ.28000 ఖాళీ అయ్యాయి. అంతేకాకుండా కొన్ని గంటల పాటు ఫోన్ హ్యాక్ కావడంతో పనిచేయకుండా పోయింది. ఆయన ఫోన్ నుంచి ఆయనకు తెలియకుండా ఫోన్‌లో ఉన్న అన్ని వాట్సాప్ గ్రూపుల్లోకి అదే మెసెజ్ పార్వర్డ్ అయిపోయింది. వెంటనే ఆయన సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తార్నాకలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. గురువారం తార్నాక, లాలాపేట, శాంతినగర్, మాణికేశ్వర్‌నగర్ తదితర ప్రాంతాల్లో మహిళలు రంగు రంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఇండ్ల ముందు, అపార్టుమెంట్లలో పెట్టి ఆడుతూ పాడుతూ సందడి చేశారు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం



దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడాపరికరాలు అందిస్తున్న దృశ్యం

చిలకలగూడ : మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కమ్మెల సాయిబాబా అన్నారు. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్నప్పటి నుంచి ఆటలు ఆడితే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యపడుతుందని, నాయకత్వ లక్షణాలు, సమన్వయం, సమస్యల సాధన అలవాటు అవుతుందన్నారు. అనంతరం పాఠశాలకు పలు రకాల క్రీడాపరికరాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ జాతీయ క్రీడకారుడు దామోదర్, పాఠశాల హెచ్‌ఎం మల్లిఖార్జునరావు, ఉపాధ్యాయులు జకియాబేగం, మల్లీశ్వరి, హసినాబేగం, నాగశృతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న వేద పండితులు

చిలకలగూడ : సీతాఫల్‌మండి శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 47వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, పద్మావతి, గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, మేళతాళాలు, బాజ భజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అంకురార్పణ, ధ్వజారోహణం, దేవతాహ్వానం అర్చన, హోమం, సహస్రనామార్చన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టామని ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ వేణుగోపాలరావులు తెలిపారు.

బతుకమ్మ పాటలతో హోరెత్తిన జెక్‌కాలనీ



సనత్‌నగర్: బతుకమ్మ వేడుకలతో జెక్‌కాలనీ ప్రత్యేక శోభను సంతరించుకుంటోంది. కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం జెక్ కాలనీ రోడ్డునెంబర్-3లోని వైష్ణవీ సన్‌రైజ్ అపార్ట్‌మెంట్ వద్ద బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. కాలనీ ఫెడరేషన్ సహకారంతో బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణలతో పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధులు భాగ్యలత, లంక హైమావతి, అమరావతి, హరిత, కృష్ణకుమారి, సృజన, శ్రీదేవి, జ్యోతి, రాజ్యలక్ష్మీ, సంధ్య, మాధవి వాణి, స్వప్న, వాణి, మాధవి, విజయ, భ్రమరాంబ, సునీత, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్ నియామకాలు వెంటనే చేపట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: జూనియర్ లెక్చరర్స్ (జేఎల్) నియామకాలు తక్షణమే చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ గురువారం డిమాండ్ చేసింది. ఈ నెల 10 వరకు డీఎస్సీ నియామకాలు చేపడుతామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఎస్ఎఫ్ఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. డీఎస్సీలో టీచర్ ఉద్యోగం పొందిన నిరుద్యోగి, జేఎల్ సాధిస్తే టీచర్ జాబ్ వదిలేసి లెక్చరర్‌కు వెళ్లాల్సి ఉంటుందని, ఇలాంటి ఇబ్బంది ఉండకుండా తొలుత జేఎల్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, నాగరాజు పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి

సికింద్రాబాద్: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... 5వ నెంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద సుమారు 35 సంవత్సరాల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడం గమనించిన పోలీసులు ఆసుపత్రికి పంపించే ప్రయత్నం చేయగా సదరు వ్యక్తి అప్పటికే అనారోగ్యంతో మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడి వివరాలు లభించలేదని పోలీసులు తెలిపారు. వివరాల కోసం 9440083160 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'స్వచ్ఛత'పై ఆకట్టుకున్న వీధి నాటకం..

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వాలంటీర్లు సికింద్రాబాద్‌లోని రీజనల్ పాస్‌పోర్ట్ కార్యాలయంలో 'స్వచ్ఛ భారత్-స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పచ్చదనం-పరిశుభ్రతపై విద్యార్థులు స్వయంగా రచించి వీధి నాటకాన్ని ప్రదర్శించి అందరినీ చైతన్యవంతులను చేశారు. రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ చైర్‌పర్సన్ ఆచార్య కే పద్మావతి దిశానిర్దేశంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కృష్ణవేణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వామి రామానందతీర్థకు ఘన నివాళి



స్వామి రామానందతీర్థ సమాధి వద్ద పుష్పాంజలి సమర్పించినఎమ్మెల్సీ వాణీదేవి తదితరులు

సనత్‌నగర్: తెలంగాణ ప్రాంతాన్ని నిజాం పాలకుల శృంఖలాల నుంచి విడిపించిన త్యాగధనులు స్వామి రామానందతీర్థ అని ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. స్వామి రామానందతీర్థ జయంతి కార్యక్రమాన్ని గురువారం బేగంపేటలోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ కమిటీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ సమాధికి పుష్పాంజలి సమర్పించారు. అనంతరం వాణీదేవి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత విముక్తికై జైలు శిక్ష అనుభవించిన రామానందతీర్థ ఆశయాల సాధన కోసం ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. అలాగే అసెంబ్లీ ఎదురుగా ఉన్నస్వామి రామానందతీర్థ విగ్రహానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ ప్రభాకర్‌రావు, సురభి సోలార్ రెనవబుల్ ఎనర్జీ చైర్మన్ శేఖర్ మారంరాజు,స్వామి రామానందతీర్థత మెమోరియల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వాసుకి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చివరి గోల్ కొడతారు

రసూల్‌పురా: ప్రజల సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆ పార్టీ నాయకులు ఎన్ని ఆటలు ఆడినా స్వతహాగా ఫుట్‌బాల్ ప్లేయర్ అయిన రేవంత్ రెడ్డి చివరి గోల్ కొడతారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్‌ఫోర్ట్ హాకీ మైదానంలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పైలట్ ప్రాజెక్టులో భాగంగా డిజిటల్ ఫ్యామిలీ కార్డ్ ప్రక్రియ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టు క్రింద చేపట్టే డిజిటల్ కుటుంబ కార్డుల జారీ ప్రక్రియను మన కంటోన్మెంట్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కావడం ఆనందంగా ఉందని అన్నారు.గతంలో మల్కాజ్‌గిరి ఎంపీగా కొనసాగిన సీఎం రేవంత్‌రెడ్డికి కంటోన్మెంట్ నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉందని కంటోన్మెంట్ పై సీఎం ప్రత్యేక దృష్టి సారించి ఒక డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. సమాచార సాంకేతిక ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ ప్రత్యేక చీఫ్ సెక్రటరి జయేష్ రంజన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం ప్రజలకు సులభంగా సంక్షేమ పథకాలు అందించేందుకు టెక్నాలజీ అవసరం గుర్తించి కొత్త విధానాలను రూపొందిస్తోందన్నారు.

ఓయూకు రేపటి నుంచి సెలవులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కాలేజీలకు రేపటి నుంచి (5న) ఈ నెల 15 వరకు దసరా సెలవులను ప్రకటించారు. అయితే పాలన భవనంతో పాటు ఇతర కార్యాలయాలు యథావిధిగా విధులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులకు మాత్రమే సెలవులు వర్తిస్తాయని బోధనేతర ఉద్యోగులు విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు.

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో టమాటా రూ.63, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండకాయ 38, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 45, పందిరి బీర 38, క్యాబేజీ 19, క్యారెట్ 43, దొండ 45, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 21, దోసకాయ 28, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 45